

టీచర్లకు సర్దు'పాట్లు'

టీచర్ల సర్దుబాటు ప్రక్రియపై టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వైఖరి సరికాదంటున్నారు. - 8లో



ఆ 48 మందిని తీసేయండి

అరసవల్లిలో 48 మందిని తీసేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. వారిని ఉపేక్షించకూడదన్నారు. - 8లో

నేడు ఆదిత్యుని ఆలయ హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లుగా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. గ్రామపెద్దలు, ఆలయ ప్రముఖులు, అధికారుల సమక్షంలో హుండీలను తెరిపించి నిబంధనల ప్రకారం లెక్కింపు చేపడతామని ఆయన ప్రకటించారు.

రాజకీయ కక్ష
వేధింపుల శిక్ష





ఫొటోల్లో ఉన్న వారు వలంటీర్లు కాదు. ఇంటింటికీ రేషన్ అందించే మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ ఆపరేటర్లు. వీరి సేవలు వెలకట్టలేమని చెప్పడానికి ఈ చిత్రాలే నిదర్శనం. ఇంతటి సేవలందిస్తున్న వీరిపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది.

ఈ నోటీసు చూడండి. పాతపట్నం టీడీపీ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తన నియోజకవర్గ పరిధిలోని ఎల్ఎన్‌పేట యంబరాం వెళ్లినప్పుడు అక్కడున్న ఎండీయూ వాహనంపై గత ప్రభుత్వ ఫొటోలు తొలగించలేదని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారని ఆ వాహనం ఆపరేటర్ కె.నవీన్‌కు ఇచ్చిన సంజాయిషీ నోటీసు ఇది. ఈ నోటీసుకు వివరణ ఇచ్చినప్పటికీ విధులను నుంచి తొలగించారు. జూలై ఒకటో తేదీ నుంచి నేటి వరకు ఆయన్ని విధుల్లోకి తీసుకోకుండా తిప్పుతున్నారు.





'ఎల్లెహే.. ఎద్దులా పెరిగావ్..'

ఎండీయూ ఆపరేటర్‌కు పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు వార్నింగ్ ఇస్తున్న దృశ్యమిది. 'ఎల్లెహే. ఎద్దులా పెరిగావు. నీకు ఎవడురా చెప్పారు. జగన్ ప్రభుత్వ బొమ్మలు ఇంకా వాహనంపై ఉంచడమేంటిరా? ఎక్కువ మాట్లాడకు ఇక్కడ. ఇక్కడ డీలర్ ఎవరు. వెంటనే ఫోన్ చేయండి' అంటూ జూలై నెలలో ఎల్ఎన్‌పేట మండలం యంబరాం పర్యటనలో ఎండీయూ ఆపరేటర్‌పై వీరంగం వేశారు. అక్కడి నుంచే మంత్రి అచ్చెన్నాయుడికి ఫోన్ చేసి, పార్టీకి తానెంత నిబద్ధతగా ఉన్నానో చెప్పే ప్రయత్నం చేశారు. 'ఎమ్మెల్యే చూసినంత వరకు తెలియదా... మీరు దొంగలను ప్రోత్సహిస్తున్నారిక్కడ' అంటూ తోటి పార్టీ వాళ్లపై మండిపడ్డారు. ఆ తర్వాత ఎమ్మార్వోతో మాట్లాడుతూ మీరు రిస్క్‌లో పడకుండా తక్షణమే ఆపరేటర్‌కు మెమో ఇవ్వండి.. వాడిని ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉండమని చెప్పండి' అంటూ డీలర్‌షిప్‌ను తొలగించాలని ఆదేశించారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

సామాన్యుడి ఇంటి వద్దకు వెళ్లి రేషన్ అందిస్తున్న ఎండీయూ ఆపరేటర్లపై కొత్త ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోంది. ఇంటింటికీ రేషన్ కార్యక్రమాన్ని మంగళం పాడేయాలనే ఉద్దేశంతో వీరిని వేధిస్తోంది. పథకం రద్దు దిశగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సూచన ప్రాయ సంకేతాలిస్తున్నారు. దీంతో అధికారులు, నాయకులు కలిపి పొమ్మనకుండా పొగ పెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

పథకం తీసేయడమే లక్ష్యం..

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నంతవరకు ఒకటో తేదీ నుంచి 17వ తేదీ వరకు ఎండీయూ ఆపరేటర్లు సరుకులు పంపిణీ చేసే అవకాశం కల్పించింది.
- అవసరమైతే మరో రెండు రోజులు పొడిగించేది.
- ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 7 వరకు .. రోజుకి 90నుంచి 120 కార్డుల వారికి సరుకుల పంపిణీ చేయాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. దీంతో వాహన ఆపరేటర్లు ప్రశాంతంగా పంపిణీ చేసేవారు.
- కానీ కొత్త ప్రభుత్వం మాత్రం వేధించడమే పనిగా పెట్టుకుంది.
- ఒకటో తేదీ నుంచి 10వ తేదీలోపు సరుకుల పంపిణీ చేయాలని సీఎస్‌డీటీల ద్వారా ఆదేశించింది.
- అంతేకాకుండా ఉదయం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు పంపిణీ చేయాలని డెడ్‌లైన్ పెట్టింది.
- రోజుకి 200 నుంచి 250 కార్డులకు సరుకులు పంపిణీ చేయాలని ఆంక్షలు విధించింది.
- ఈ ఆదేశాలు, నిబంధనలు ఆచరణలో సాధ్యం కాదని ఎండీయూ ఆపరేటర్లు గగ్గోలు పెడుతున్నారు.
- అసలు డీలర్ ఎప్పుడు సరుకులు ఇస్తాడు, తాము ఉదయం ఆరు గంటలకు ఎలా పంపిణీ ప్రారంభించగలమని తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తున్నారు.
- ఇప్పటికే ఎండీయూ ఆపరేటర్లు రోడ్డెక్కి నిరసన తెలియజేస్తున్నారు.



- ఇంటింటికీ రేషన్ సరుకులిచ్చే ఎండీయూ ఆపరేటర్లపై కక్ష కట్టిన ప్రభుత్వం
- ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 వరకు పంపిణీ చేయాలని ఆదేశం
- 10వ తేదీ కల్లా పంపిణీ పూర్తి చేయాలని హుకుం
- రోజుకి 200 నుంచి 250 కార్డుదారులకు పంపిణీ చేయాలని ఒత్తిడి
- వేధింపులే లక్ష్యంగా ఆదేశాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆపరేటర్లు
- పాతపట్నంలో ఎమ్మెల్యే గోవిందరావు తీరుపై తీవ్ర అసహనం

- ఒకవైపు అధికార పార్టీ నాయకుల వేధింపులు, మరోవైపు సీఎస్‌డీటీల ద్వారా చేస్తున్న సతాయింపులు భరించలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

అంతా కక్షపూరితం..

అంతకుముందు ఎన్నడూలేని విధంగా వైఎస్ జగన్ ప్రభుత్వం తెలుపు రేషన్‌కార్డు దారుల ఇంటి దగ్గరికి తీసుకెళ్లి సరుకులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా 422 మందికి ఎండీయూ వాహనాలను 90శాతం సబ్సిడీతో అందజేసింది. నేరుగా 60శాతం సబ్సిడీ ఇవ్వగా, 30శాతం ఈఎంఐల వారీగా చెల్లించుకునే వెసులు బాటు కల్పించి, ఆ మొత్తాన్ని ప్రభుత్వమే భరించింది. వారికిచ్చే జీతంలో ఈఎంఐ వాటా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఏడేళ్ల ఒప్పందంలో భాగంగా దాదాపు నాలుగేళ్లు పూర్తి కావచ్చింది.ఆ ఒప్పందం పూర్తయితే ఆ వాహనం ఆపరేటర్‌కు చెందుతుంది. దీంతో పాటు ఒక్కో ఆపరేటర్‌కు నెలకి రూ.21వేలు ఇస్తూ వస్తోంది. ఇందులో ఈఎంఐ కింద రూ. 3వేలు పోనూ మిగతా మొత్తాన్ని తమకొచ్చిన వేతనంగా ఆపరేటర్లు ఆనందపడేవారు. అందులోనే కొంత మొత్తాన్ని సహాయకులకు జీతంగా ఇచ్చి పెట్టుకుంటూ ఇంటింటికీ రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని నడిపిస్తూ వచ్చారు. కానీ కొత్త ప్రభుత్వానికి సామాన్యుడు కాస్త సుఖ పడడం రుచించడం లేదు. వాహనాల ద్వారా రేషన్ పంపిణీకి తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తోంది. ఇందులో కీలకమైన ఎండీయూ ఆపరేటర్లను వేధించే పని పెట్టుకుంది. వేధింపులు, ఒత్తిళ్లకు గురిచేస్తే వారే స్వచ్ఛందంగా తప్పుకుంటారనే ఉద్దేశంతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది.

ఇష్టానుసారం మాట్లాడుతున్నారు..



ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థపై కూటమి నేతల తీరు సరిగా లేదు. ఇంటింటికీ సరుకులు అందించడంలో ఆపరేటర్ల సేవలు వెలకట్టలేనివి. కరోనా సమయంలో ఇంట్లో ఉన్న వాళ్లే బయటకు రాలేని భయంకర పరిస్థితులు ఉన్నప్పుడు ఇంటింటికి వెళ్లి సరుకులు అందించాం. ఇలాంటి వ్యవస్థని పట్టుకుని రైస్ మాఫియా అని, వారు అనుకున్నట్టుగా వ్యవహరించలేదని దుర్భాషలాడటం సరికాదు. ప్రభుత్వం పెడుతున్న ఒత్తిళ్లను తట్టుకోలేకపోతున్నాం.

– రౌతు సూర్యనారాయణ, ఎండీయూ ఆపరేటర్ల అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు

ఒత్తిళ్లతో అనారోగ్యం పాలవుతున్నాం



ఉదయం 6 గంటలకే పంపిణీ ప్రారంభించాలని ఆదేశించడంతో విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నాం. చాలా మండలాల్లో ఆపరేటర్లు అనారోగ్యం పాలయ్యారు. పంపిణీ ఆలస్యమైతే చాలు దుర్భాషలాడుతూ మా మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు ఒత్తిడి తెచ్చి, భయపెట్టి పనులు చేయించడం సబబు కాదు.

– డి.గోపి, ఎండీయూ ఆపరేటర్, కొత్తూరు మండలం యూనియన్ అధ్యక్షుడు

పాతపట్నంలో ఎమ్మెల్యే ఓవరాక్షన్

పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తీరుపై ఎండీయూ ఆపరేటర్లు తీవ్రంగా మండిపడుతున్నారు. ఆయన వైఖరిని బాహాటంగా విమర్శిస్తున్నారు. జూలై నెలలో ఆయన ఓ ఎండీయూ ఆపరేటర్‌పై చేసిన ఓవరాక్షన్ చూస్తే ఎవరికైనా అసహనం కలగకమానదు. తన నియోజకవర్గ ఓటర్ని పట్టుకుని ఇష్టారీతిన మాట్లాడటమే కాకుండా గత ప్రభుత్వ పెద్దల్ని నోటికొచ్చినట్టు దుర్భాషలాడారు. తోటి టీడీపీ కార్యకర్తలే ఆయన తీరును చూసి ముక్కున వేలేసుకున్నారని ఎండీయూ ఆపరేటర్లు చెబుతున్నారు.

● హర్ ఘర్ తిరంగా..



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు మంగళవారం ర్యాలీ చేశా రు. యువత జాతీయ సమైక్యతను చాటి చెప్పాలని నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్ అన్నారు. అంతకుముందు దేశ సమైఖ్యతను దృష్టిలో పెట్టుకొని డ్రగ్స్, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. – నరసన్నపేట

● ఆటపాటలు ముమ్మరంగా..



స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా బడుల్లో ఆటపాటలు ముమ్మరంగా జరుగుతున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొంటున్నారు. – శ్రీకాకుళం న్యూకాలనీ

పింఛన్లు తీసేసే
పన్నాగం



- ప్రత్యర్థుల పింఛన్లు ఏరివేసేందుకు భారీ కుట్ర
- సూత్రధారులుగా కూటమి నేతలు.. పాత్రధారులుగా అధికార వర్గాలు
- ముందుగా దివ్యాంగుల పింఛన్లపైనే కోత
- రకరకాల కారణాలు చూపించి పింఛన్లు తీసేసేందుకు నోటీసులు జారీ

ఈ ఏడాది జూన్ నాటికి జిల్లాలో ఉన్న పింఛన్ల సంఖ్య 3,19,702

జూలై నాటికి ఈ సంఖ్య 3,19,147కు తగ్గింది.

ఆగస్టు 1 నాటికి 3,18,017కు చేరింది.

సెప్టెంబర్ నాటికి ఈ సంఖ్య ఇంకా తగ్గే అవకాశం కనిపిస్తోంది.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి నేతల కక్ష సాధింపు చర్యలకు పండుటాకులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు బలి కాక తప్పేలా లేదు. పరిణామాలు చూస్తుంటే 2014–19 పరిస్థితులు పునరావృతమయ్యేలా కనబడుతున్నాయి. అధికార పార్టీ నాయకులు ప్రస్తుతం చిరుద్యోగులతో పాటు పింఛన్‌దారులపై కక్ష కట్టారు. మొన్నటి ఎన్నికల్లో తమకు అనుకూలంగా పనిచేయని వారిపై వేటు వేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఎలాగైనా సరే తాము చెప్పిన పింఛన్లు రద్దు చేయాలని అధికారులపై ఒత్తిళ్లకు దిగుతున్నారు. తొలగించాల్సిన పింఛన్ల జాబితాలు పంపించి అధికారులను సతాయిస్తున్నారు. దీంతో లేనిపోని సాకులు చూపించి, ఎందుకు తొలగించకూడదంటూ పింఛన్‌దారులకు నోటీసులు పంపిస్తున్నారు. ఇదంతా చూస్తుంటే కొత్త పింఛన్లు దేవుడెరుగు.. ఉన్న పింఛన్లు ఎగిరిపోయే పరిస్థితి కనబడుతోంది.

- సరుబుజ్జిలి మండలం వ్యాసలిపేటలో తొమ్మిది మంది పింఛన్‌దారులకు నోటీసులు ఇచ్చారు. పింఛన్లు ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలంటూ అధికారులు నోటీసులు జారీ చేశారు.
- బూర్జ మండలంలో 10 మంది పింఛన్లు తొలగిస్తామంటూ మండల పరిషత్ అధికారులు నోటీసులు ఇచ్చారు.
- నందిగాం మండలం నౌగాం పంచాయతీలో 8 మంది వికలాంగులకు, ఇద్దరు వృద్ధాప్య పింఛనుదారులకు నోటీసులు జారీ చేశారు.
- ఆమదాలవలస మండలంలో ఎనిమిది మందికి పింఛన్లు తొలగించేందుకు నోటీసులు జారీ చేసేందుకు సిద్ధం చేశారు.
- జలుమూరు, ఎచ్చెర్ల మండలాల్లో కూడా భారీ సంఖ్యలో పింఛన్లు తీసివేసేందుకు నోటీసులు సిద్ధం చేస్తున్నారు.


ఇలా దాదాపు ప్రతి మండలంలోనూ ప్రస్తుత పింఛనుదారులకు నోటీసులు జారీ చేశారు. వివరణ సంతృప్తికరంగా ఉంటే పింఛను కొనసాగుతుందని లేదంటే చర్యలు తప్పవని నోటీసుల్లో ప్రస్తావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన మరుసటి నెల (జూలై) నుంచే ఈ కసరత్తు ప్రారంభమైంది. ఒక్కసారిగా తొలగిస్తే ప్రజల నుంచి ఆదిలోనే వ్యతిరేకత వస్తుందన్న ఉద్దేశంతో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. గ్రామాల వారీగా కానివారి జాబితాను తెప్పించుకుని, మండలాల వారీగా లిస్టులు తయారు చేసి, ఎమ్మెల్యేల సిఫార్సులతో అధికారులకు తొలగించాల్సిన వారి పేర్లు వెళ్తున్నాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెప్పిన వారికే పింఛను కొనసాగేలా అడుగులు పడుతున్నాయి. చెప్పినట్టు చేయకపోతే మండలంలో పనిచేయలేరంటూ పరోక్షంగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

కొత్తవి ఎలా..?

టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతీసారి ఒక సెంటిమెంట్ నడుస్తుంది. అప్పటికే ఉన్న పింఛన్‌దారులు చనిపోతేనో, లేదంటే జాబితాలో వారి పేరు తొలగిస్తేనో మాత్రమే కొత్త పింఛన్లు ఇస్తారు. అప్పట్లో జన్మభూమి కమిటీ సభ్యుల అరాచాలకు అప్పట్లో ఎంతోమంది బలయ్యారు. ఇప్పుడదే పరిస్థితి కనబడుతోంది. వాస్తవంగా మొన్నటి ఎన్నికల్లో 50 ఏళ్లు దాటిన వెనకబడిన వర్గాల వారందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ లెక్కన కొత్తగా పింఛన్లకు అర్హులైన వారి సంఖ్య జిల్లాలో 3,05,537 వరకు ఉంది. వీరందరికీ పింఛన్లు మంజూరు కావాలి. కానీ, ఇంతవరకు ఆ హామీ జోలికే కూటమి ప్రభుత్వం వెళ్లడం లేదు.

2014-19 పాలన పునరావృతం

కూటమి ప్రభుత్వంలో ముఖ్యంగా టీడీపీ నాయకులకు పింఛన్ల తొలగింపు కుట్రలు కొత్తేమీ కాదు. 2014–19లో కూడా ఇదే రకంగా వ్యవహరించారు. అప్పట్లో టీడీపీ అధికారంలోకి వచ్చేసరికి జిల్లా వ్యాప్తంగా (2014 జూన్ నాటికి) 2,99,925 పింఛన్లు ఉండగా సెప్టెంబర్‌కు వచ్చేసరికి 2,25,732 కు పింఛన్లు తగ్గిపోయాయి. మూడు నెలల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 74,194 పింఛన్లు తొలగించేశారు. అప్పట్లో బాధితుల తరఫున వైఎస్సార్‌సీపీ నాయకులు హైకోర్టుకెళ్లి ఆధారాలతో నిరూపించడంతో చాలావరకు పింఛన్లు పునరుద్ధరించారు. ఇప్పుడు అవే పరిస్థితులు పునరావృతమవుతున్నాయి.



నందిగాం,బూర్జ మండలాల అధికారులు జారీ చేసిన నోటీసులు

అధికార పార్టీలకు సంబంధం లేని వారి పింఛన్లు భారీగా ఏరివేసేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నిస్తున్నారు. తాము చెప్పింది జరిగిపోవాలన్నట్టుగా అధికారులపై ఒత్తిళ్లు చేస్తున్నారు.

క్లుప్తంగా

1200 లీటర్ల సారా ఊట ధ్వంసం



సారా స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్న సిబ్బంది

మెళియాపుట్టి: ఎంసీపీ కొత్తూరు గ్రామంలోని కొండ ప్రాంతంలో సారా తయారీ స్థావరాలపై టెక్కలి, పలాస ఎస్‌ఈబీ, డీటీఎఫ్ పోలీసులు దాడులు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ దాడుల్లో 1200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలు ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజశేఖర్ నాయుడు తెలిపారు. వినియోగించిన ప్లాస్టిక్ డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో టెక్కలి ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్వహణ ఇలాగేనా..?



కేజీబీవీ ఎస్‌ఓ శారదను వివరణ అడుగుతున్న జడ్జి హరిప్రియ

పోలాకి: బాలికల వసతి గృహంలో మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోతే ఎలా..? అంటూ నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ హరిప్రియ గంగివలస కేజీబీవీ ఎస్‌ఓపై అసహనం వ్యక్తం చేశారు. ఆమె మంగళవారం కేజీబీవీలో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. తరగతి గదులు, ఆట స్థలం, మరుగుదొడ్లు, వంటశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మరుగుదొడ్లలో నీటి సరఫరా నిలిచిపోవటం, డోర్‌లు విరిగిపోవటాన్ని గమనించి ఎస్‌ఓ శారదకు వాటిపై వివరణ అడిగారు. వీలైనంత త్వరగా వాటిని బాగుచేయాలని సూచించారు. అనంతరం నాడు–నేడులో భాగంగా నూతనంగా నిర్మించిన తరగతి గదులను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వసతి ఏర్పాట్లు ఎలా ఉంటున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆమెతోపాటు అడ్వకేట్‌లు జీవీపీ నాయుడు, జి.అప్పారావు, ఎస్‌ఐ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మహిళా రైతులకు బంతి సాగు బాగు



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ హరి కుమార్

ఆమదాలవలస: మహిళా రైతులకు బంతి తోటల సాగు మంచి ఆదాయాన్ని ఇస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వి.హరి కుమార్ అన్నారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీఎం పైడి కూర్మారావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయంలో చిరుధాన్యాలను పండించడంతోపాటు పుట్టగొడుగుల పెంపకం, తేనె తయారీ, ఉద్యాన పంటలు లాభదాయకంగా ఉంటాయని తెలిపారు. బంతి, చామంతి వంటి పూల మొక్కల పెంపకం ద్వారా ఆదాయం బాగుంటుందని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

కాశీబుగ్గ: మందస మండలం హరిపురం గ్రామ సమీపాన రట్టి రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చుక్కా రామ్మూర్తి (75) అనే వ్యక్తి మృతి చెందారు. రట్టి రోడ్డు సమీపంలో రోడ్డు దాటుతుండగా మడియా మురళి అనే యువకుడు బండితో ఢీకొట్టాడని మందస ఏఎస్‌ఐ శేఖర్ తెలిపారు. మంగళవారం రాత్రి వైద్య సేవలు పొందుతూ హరిపురం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో మరణించారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

కిడ్నీ ఆస్పత్రిలో నిలిచిన తాగునీటి సరఫరా



పనిచేయని తాగునీటి ఫ్రిడ్జ్

కాశీబుగ్గ: పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రంలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఆస్పత్రికి వందలాది మంది వస్తుండగా.. వారి కోసం అందుబాటులో ఉంచిన గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఉన్న తాగునీటి ఫ్రిడ్జ్ పాడైపోయింది. దీంతో ఆస్పత్రి క్యాజువాలిటీ, వార్డులో ఉన్న ఇన్ పేషెంట్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయంపై ఆస్పత్రి అధికారులకు వివరణ కోరగా బాగు చేసి తాగునీరు అందిస్తామని అన్నారు.

టీచర్లకు సర్దు'పాట్లు'

- ఉపాధ్యాయుల సర్దుబాటు అంతా అస్తవ్యస్తం
- ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు కొరత తీర్చేందుకంటూ ఆదేశాలు
- కనీస నిబంధనలు పాటించడం లేదని టీచర్ల ఆక్రందన
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు



తరగతి గదిలో పాఠాలు బోధిస్తున్న ఓ ఉపాధ్యాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ:

ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సర్దుబాటు బెంగపట్టుకుంది. గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల విలీనంపై ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిజానికి నూతన విద్యా విధానంలో భాగంగా దీన్ని అప్పటి ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది తప్పిస్తే.. ఉపాధ్యాయులపై కక్షతో కాదు. ఈ విలీన ప్రక్రియను అప్పట్లో తీవ్రంగా వ్యతిరేకించిన అప్పటి ప్రతిపక్షం, ప్రస్తుత అధికారపక్షమైన టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే సర్దుబాటు ప్రక్రియకు తెరలేపింది. దీంతో గత ప్రభుత్వం చేపట్టిన విలీన ప్రక్రియకు కూటమి ప్రభుత్వం పరోక్షంగా ఆమోదం తెలిపినట్లేనంటూ ఉపాధ్యాయ సంఘాలు నాయకులు నేరుగా ఆక్షేపిస్తున్నారు.

టీఐఎస్‌లో ఇప్పటికే నిక్షిప్తం..

కొత్త ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తీవ్ర ప్రభావం చూపినట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. దీంతో ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం ఫేషియల్ అటెండెన్స్ యాప్‌లో టీచర్ల వివరాలను నమోదు చేయించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా మిగులు ఉపాధ్యాయుల్ని ఖరారు చేశారు. మరోవైపు చాలా ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. ఈ క్రమంలో మిగులు సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ)లో వారి అదనపు విద్యార్హతను బట్టి సబ్జెక్టు టీచర్లుగా పంపించాలని నిర్ణయించారు. అయితే ఇది తాత్కాలికమా, శాశ్వతమా అన్న మాటకు ఇప్పటి వరకు జవాబు లేదు. వచ్చే జనవరిలో డీఎస్సీ–2024 నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్పుడు మళ్లీ ఉపాధ్యాయుల్ని సర్దుబాటు చేయక తప్పదు.

సీనియారిటీ ఆధారంగా మిగులు నిర్ధారణ

మిగులు పోస్టుల నిర్ధారణలో కేడర్ (సర్వీస్) సీనియారిటీని ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. ఇందులో జూనియర్లను మాత్రమే మిగులు టీచర్లుగా నిర్ణయిస్తారు. గతంలో సీనియర్ కోరుకుంటే వారిని సర్దుబాటు జాబితాలో చేర్చేవారు. ప్రస్తుతం ఆ అవకాశం లేకుండా కేవలం కేడర్ జూనియర్‌ను మాత్రమే సర్దుబాటు చేయాలని నిర్ణయించారు. వాస్తవానికి ఈ ప్రక్రియను ఈ నెల 14వ తేదీలోగా పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. మిగులు పోస్టులపై జిల్లా విద్యాశాఖ అనేక కసరత్తులు చేసింది. మొత్తంమీద 1090 వరకు మిగులు టీచర్లు ఉన్నట్టు ప్రాథమికంగా భావిస్తున్నారు.

ఈ సంఖ్య మారొచ్చు. ఏయే స్కూళ్లలో, ఏయే సబ్జెక్టులకు టీచర్లు అవసరమో ఖరారు చేసి, ఆ మేరకు మిగులు టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అయితే కేడర్ సీనియార్టీ/ స్టేషన్ సీనియారీపై నెలకొన్న సందిగ్ధత నేపథ్యంలో ఈ తతంతం మరింత జాప్యంకానుంది. దీనికితోడు ఉపాధ్యాయులు బాయ్‌కాట్ చేయడంతో సర్దుబాటు ప్రక్రియ మరింత రసవత్తరంలో పడింది. ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏపక్షి నిర్ణయాలతో విద్యాశాఖ అడుగులు వేస్తుండటంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

ఉపాధ్యాయ సర్దుబాటా.. మూసివేతా?

ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రక్రియ చూస్తుంటే ప్రభుత్వ బడులను మూసివేసేలా కనిపిస్తోంది. ఇటీవల పదవీ విరమణలు, కొద్ది మంది ఉపాధ్యాయులు మృతిచెందడం వల్ల పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. వీటిని భర్తీ చేయాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే తక్షణమే ప్రమోషన్లు కల్పించాలి.

– మజ్జి మదన్‌మోహన్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

అంతా గందరగోళంగా ఉంది

రాష్ట్ర విద్యాశాఖ తాజాగా విడుదల చేసిన ఉపాధ్యాయ పని సర్దుబాటు ప్రక్రియంతా గందరగోళంగా, లోపభూయిష్టంగా ఉంది. ఒక పాఠశాలలో ఒకే క్యాడర్‌లో ఉన్న భాషోపాధ్యాయులను మిగులు ఉపాధ్యాయులుగా గుర్తించినప్పుడు డీఎస్సీ ర్యాంక్ ఆధారంగా గుర్తించాలి. పుట్టిన తేదీ ప్రకారంగా గుర్తించడంతో మంచిర్యాంకులో ఉన్న వారు ఇబ్బందులకు గురవుతారు.

– పిసిని వసంతరావు, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లాశాఖ అధ్యక్షుడు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళం–విజయనగరం–విశాఖ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ స్థానానికి వచ్చే ఏడాది మార్చి 29న పదవీ కాలం ముగుస్తుండటంతో కొత్తగా ఉపాధ్యాయ ఓటర్ల జాబితాలో పేర్ల నమోదుకు ఈ సెప్టెంబరు 30న నోటీసు జారీ చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి మంగళవారం ఆయన ఆయా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 2024 డిసెంబరు 30 నాటికి తుది ఓటర్ల జాబితా రూపొందించాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే 2025 సాధారణ ఓటర్ల జాబితా రూపకల్పనకు షెడ్యూల్ విడుదల చేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే వచ్చే ఏడాది జనవరి 6వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని అన్నారు.

ఈ వీసీలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల నమోదు తాజా పరిస్థితిని గణాంకాలతో వివరించారు. అనంతరం కలెక్టర్ ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు బీఎల్వోలు హౌస్ టు హౌస్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని, అనంతరం అక్టోబర్ 29 నాటికి ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందించి, డిసెంబర్ 24వ తేదీ లోపు అభ్యంతరాలను పరిష్కరించి తుది ఓటర్ల జాబితాను రూపొందించాలని ఆదేశించారు. స్పష్టమైన ఫొటోలు, చిరునామా ఓటరు జాబితాలో కనిపించేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, డీఆర్‌ఓ అప్పారావు, ఆర్డీవోలు సీహెచ్ రంగయ్య, భరత్ నాయక్, సుదర్శన్ దొర, ఆర్వోలు లక్ష్మణ మూర్తి, రామ్మోహన్, అప్పారావు, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వరరావు, సి–సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు హాజరయ్యారు.

ఇసుక టిప్పర్, లారీ స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, లారీలను మంగళవారం వేకువ జామున పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో నాటు బళ్లతో తెచ్చిన ఇసుక లారీ, టిప్పర్లకు లోడింగ్ చేసి విశాఖపట్నం తరలిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఎమర్జెన్సీ సర్వీసెస్ టోల్ ఫ్రీ నంబర్ 112కు ఫోన్ కాల్ వెళ్లగా ఎచ్చెర్ల ఎస్‌ఐ చిరంజీవి ఆధ్వర్యంలోని పోలీసుల జాతీయ రహదారిపై తనిఖీ చేశారు. టిప్పర్‌ను కుశాలపురం బైపాస్ సమీపంలో, లారీని చిలకపాలెం సమీపంలో జాతీయ రహదారిపై పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ వాహనాలు చిలకపాలేంకు చెందిన వారివిగా పోలీసులు గుర్తించారు. అనంతరం నిబంధనల మేరకు కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేశారు.

'అవి అక్రమ కట్టడాలే'

కొత్తూరు: స్థానిక కడుము కాలనీలోని ప్రభుత్వ స్థలంలో టీడీపీ ఎంపీటీసీ జీడి పిక్కల ఫ్యాక్టరీ, వాటర్‌ప్లాంట్ అక్రమంగా నిర్మించారని గ్రామానికి చెందిన రౌతు మహేష్ కలెక్టర్‌కు గతంలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కొత్తూరు తహసీల్దార్‌ను విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో మండల సర్వేయర్, వీఆర్వో, విలేజ్ సర్వేయర్‌లు ఈ నెల 5న విచారణ చేపట్టారు. ఈ కట్టడాలు ప్రభుత్వ స్థలంలోనే ఉన్నాయని రెవెన్యూ అధికారులు గుర్తించారు. అక్రమ నిర్మాణాల తొలగింపు కోసం నోటీసులు జారీ చేసి తర్వాతి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

వలస మత్స్యకారుడు మృతి



రోదిస్తున్న కుటుంబ సభ్యులు ఇన్‌సెట్‌లో పోలీసు(ఫైల్)

శ్రీకాకుళం రూరల్: పెదగనగళ్లవానిపేట పంచాయతీ నర్సయ్యపేట గ్రామానికి చెందిన కొరమ పోలీసు (40) కర్ణాటక రాష్ట్రం మంగళూరులో చేపల వేటకు వెళ్లి సోమవారం మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 3న ఆయన శ్రీకాకుళం నుంచి కర్నాటకకు వెళ్లారు. అక్కడ సముద్రంలో వేట చేస్తుండగా తుఫాన్ కారణంగా బోటు మీద నుంచి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తోటి మత్స్యకారులు కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న జిల్లా మత్స్యకార సంఘ నాయకులు కోనాడ నర్సింగరావు, మాజీ సర్పంచ్ గురువులు, మత్స్యకార నాయకులు కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. ప్రభుత్వ పరంగా మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకువచ్చేలా ఏర్పాటు చేయాలని వారు జిల్లా ఉన్నతాధికారులను కలిసి విన్నవించారు. పోలీసు మరణవార్త విని గ్రామంలో విషాద ఛాయలు అమలు కున్నాయి.

ఆ 48 మందిని తీసేయండి

- కొవ్వాడ నిధులపై వడ్డీ ఖర్చుల వివరాలు అందజేయాలి
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



వివిధ శాఖలపై సమీక్షిస్తున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

అరసవల్లి దేవస్థానంలో దినసరి పద్ధతిలో పనిచేస్తున్న 48 మంది ఉద్యోగులను తొలగించాలని, వారి స్థానంలో కొత్తవారిని అవుట్‌సోర్సింగ్‌లో వేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులకు ఆదేశించారు. ఆయన మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్, దేవదాయ, గనులు భూగర్భ, కొవ్వాడ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. తాడు బొంగరం లేని ఉద్యోగులను ఉపేక్షించవద్దని అరసవల్లి దినసరి ఉద్యోగులను ఉద్దేశించి అన్నారు. అరసవల్లిని మోడల్ టెంపుల్‌గా మార్చేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని, శ్రీకూర్మంలో పుష్కరిణి వద్ద పారిశుద్ధ్య పనులు చేయించాలని తెలిపారు. అరసవల్లి దేవాలయ ఆధీనంలో ఉన్న దుకాణాలకు వేలంపాట నిర్వహించాలన్నారు. అలాగే కొవ్వాడ అణు విద్యుత్ ప్లాంట్‌కి సంబంధించిన నిధులు ఎంత ఉన్నాయి, ఆ నిధులపై వడ్డీ ఎలా ఖర్చు చేస్తున్నారో వివరాలు అందించాలని అధికారులకు సూచించారు. స్థానికుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని సత్వరమే పరిష్కరించాలన్నారు. యూత్ ప్యాకేజీ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, అణు పార్క్ ప్రహరీ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావును సమన్వయం చేసుకొని అధికారులు పనిచేయాలని సూచించారు.

ఇసుక విధానంలో రెవెన్యూ, మైన్స్, పోలీసుల వైఖరి వల్ల ప్రభుత్వంపై నింద పడుతోందన్నారు. నూతన పాలసీ ప్రకటించే వరకూ అక్రమ ఇసుక అనే మాటే రాకూడదని అన్నారు. శ్రీకాకుంలో డే అండ్ నైట్ నుంచి మధ్య గల డివైడర్ మొక్కలు తొలగించి, ప్రత్యామ్నాయ మొక్కలు వేయాలన్నారు. జిల్లా కేంద్రం చుట్టూ 36 కిలోమీటర్ల పొడవున 200 అడుగుల వెడల్పుతో 18 గ్రామాలను కలుపుతూ ఓఆర్ఆర్ నిర్మాణం చేపడతామని, ఇందుకోసం 542 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉందని, ప్రాజెక్టుకు అన్ని అనుమతులు తీసుకుని ప్రజాభిప్రాయ సేకరణ చేసి ముందుకు వెళ్లాలని సూచించారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌కు ప్రస్తుతం ఉన్న కార్యాలయ భవనం స్థానంలో కమర్షియల్ కాంప్లెక్స్‌తో కూడిన నూతన కార్యాలయాన్ని నిర్మించాలని చెప్పారు. నాగావళిలోని సబ్ సర్ఫేస్ డైక్ నుంచి రెల్లి వీధి వరకూ నాగావళి నదికి కరకట్ట నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో సమన్వయం చేసుకొని యంత్రాంగం పనిచేయాలని సూచించారు. నగరంలో నీరు నిలిచి పోకుండా వెంటనే 7.5 కిలోమీటర్ల మేర మిర్తి బట్టి, సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయని, పనులు వెంటనే మొదలు పెట్టాలని ఆదేశించారు. డే అండ్ నైట్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకూ 80 అడుగుల వరకూ రోడ్డు విస్తరించాలని, బలగ వరకూ విస్తరణ పనుల్లో నష్టపోయిన వారికి టీడీఆర్‌లు ఇవ్వాలని సూచించారు. పాత్రునివలస, పెద్దపాడులో మంచినీటి సరఫరా పనులకు రూ.24 కోట్లతో పనులు మొదలు పెట్టాల్సి ఉందన్నారు. నెలన్నర రోజులుగా రూ.కోటి ఖర్చుతో మరుగు కాలువల్లో పూడిక తీత పనులు చేస్తున్నట్లు కమిషనర్ ఓబులేసు తెలిపారు. నగరంలో పలు సమస్యలను ప్రస్తావించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, శ్రీకాకుళం, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్ ఈశ్వరరావు, ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ ఈఈ సుగుణాకర రావు, అరసవెల్లి డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్ర శేఖర్, కొవ్వాడ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీనారాయణ, గనులు భూగర్భ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

'పీఎం సూర్య ఘర్‌ను సద్వినియోగం చేసుకోండి'



మాట్లాడుతున్న ఎస్‌ఈ కృష్ణమూర్తి, పక్కనే ఈఈలు బయ్యన్నాయుడు, సురేష్‌కుమార్

అరసవల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన సోలార్ పథకాన్ని జిల్లాలో గృహ వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ సర్కిల్ ఎస్‌ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ పథకం వివరాలను వెల్లడించారు. గత ఏడాది ఈ సోలార్ సబ్సిడీ పథకం అమల్లోకి వచ్చిందని, ఇంతవరకు 104 మంది గృహ వినియోగదారులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నారని, వీరిలో ఇప్పటివరకు 37 మందికి సోలార్ రూఫ్ టాప్‌ను అమర్చామని వివరించారు. జిల్లాలో మొత్తం 6.65 లక్షల మంది గృహ వినియోగదారులు ఉన్నారని, వీరంతా విద్యుత్ వినియోగ చార్జీలను తగ్గించుకునేందుకు ఈ సోలార్ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదుగురు వెండర్లను కంపెనీ నిర్ణయించిందని, వీరిలో ఎవరినైనా ఆన్‌లైన్‌లో వినియోగదారులు ఎంపిక చేసుకునే వెసలుబాటు ఉందన్నారు. సోలార్ సిస్టమ్ సింగిల్ ఫేజ్ (5 కిలోవాట్ వరకు) రిజిస్ట్రేషన్ కోసం రూ.1000, జీఎస్టీ రూ.180తో కలిపి మొత్తం రూ.1180 చెల్లించాలని, త్రీఫేజ్ కోసం (5 నుంచి 10 కిలోవాట్ కోసం) రూ.5 వేలు, జీఎస్టీ రూ.900 కలిపి మొత్తంగా రూ. 5900 చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకునే ఆసక్తి గల వారు పీఎంసూర్యఘర్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ లేదా వెబ్‌పోర్టల్‌లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 1912 ఫ్రీ కాల్ ద్వారా సంప్రదించాలని సూచించారు. ఒక కిలోవాట్ సోలార్ ప్రాజెక్టుకు విలువ రూ.83వేలు కాగా, ప్రభుత్వ సబ్సిడీ రూ.30 వేలు వరకు ఉంటుందని, అలాగే 2 కిలోవాట్‌కు ప్రాజెక్టు విలువ రూ.1.44 లక్షలు కాగా, రూ.60 వేలు సబ్సిడీ, అలాగే 3 కేవీ నుంచి 9 కేవీ వరకు ప్రాజెక్టు విలువలో రూ.78 వేలు వరకు ప్రభుత్వం సబ్సిడీ నేరుగా వినియోగదారుడి ఖాతాలోకి జమ అవుతుందన్నారు. అలాగే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు కావాల్సిన వారు ఇకపై ఎలాంటి కార్యాలయ అధికారులకు, మధ్యవర్తులకు సంప్రదించకుండా నేరుగా 1912 కి కాల్ చేసి దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడినట్లుగా గుర్తించినా... 1912కి కాల్ చేస్తే వెంటనే సిబ్బంది తగురీతిలో స్పందించి చర్యలు చేపడతారన్నారు. సమావేశంలో విద్యుత్ సర్కిల్ టెక్నికల్ ఈఈ జి.సురేష్‌కుమార్, ఆపరేషన్స్ ఈఈ బయ్యన్నాయుడు తదితరులున్నారు.

శ్రీకాకుళంలో స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



మాట్లాడుతున్న కిల్లంశెట్టి సాగర్, పక్కనే మెట్ట అశోక్, సూరిబాబు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో ఏపీ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. సెప్టెంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు అండర్–19 విభాగంలో జరిగే ఈ పోటీలకు ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రభుత్వంతోపాటు దాతలు సహకరిస్తే విజయవంతంగా పోటీలను నిర్వహిస్తామని బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ పేర్కొన్నారు. శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీ ఇండోర్ స్టేడియం వేదికగా మంగళవారం సాయంత్రం ఆ సంఘ కార్యవర్గ సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో బ్యాడ్మింటన్ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్‌తో కలిసి సాగర్ మాట్లాడారు. శ్రీకాకుళంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో అండర్–19 ఆంధ్రప్రదేశ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2024 పోటీలు నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు ప్రారంభించినట్టు చెప్పారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ మూడు విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు.

నిర్వహణ కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. ఇక్కడ జరిగే పోటీల్లో రాణించి విజేతలుగా నిలిచిన క్రీడాకారులు సెప్టెంబరు 8 నుంచి 12 వరకు రాజమండ్రిలో జరగనున్న సౌత్ జోన్ అండర్–19బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధిస్తారని వివరించారు.

మెట్టవలసలో డయేరియాపై ఆరా



మెట్టవలస జంగాల పేటలో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

జి.సిగడాం: మెట్టవలస గ్రామాన్ని జిల్లా ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ పి.సుజాత మంగవారం సందర్శించి అతిసార వ్యాధి రావడానికి కారణాలు కారణాలు సేకరించారు. జంగాలపేటలో ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. గత మూడు రోజుల నుంచి గ్రామంలో డయేరియా కేసులు నమోదు కాలేదని, ప్రతి వీధిలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తల సమక్షంలో ప్రత్యేక సర్వే చేపడుతున్నామని స్థానిక వైద్యులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు వెల్లడించారు. గ్రామంలో 24 గంటల వైద్య సేవలను అందించేందుకు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కామొజుల సీతారాం, ఎంపీటీసీ బెవర జగన్నాథం, సిహెచ్‌ఓ శివప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ బగాది భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ భాస్కరరావులతోపాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితం నాశనం



మాట్లాడుతున్న కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భరతలక్ష్మి

శ్రీకాకుళం రూరల్: ర్యాగింగ్‌తో విద్యార్థుల జీవితాలు నాశనమవుతాయని నైరాలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ భరతలక్ష్మి అన్నారు. కళాశాలలో మంగళవారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నైరా కళాశాల 'ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్'గా ఉందన్నారు. రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పైడిపునాయుడు మాట్లాడుతూ కళాశాల, హాస్టల్ క్యాంపస్‌లో ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖాధికారి నారాయణరావు, రూరల్ ఎస్‌ఐ వాసుదేవరావు, దిశ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ రేవతి తదితరులు పాల్గొన్నారు.